


ఈ మోపెడ్ కొన్నదగ్గర్నుంచీ నా ప్రాణానికి నిశ్చింతలేకుండా పోయింది. నాలో వున్న శక్తంతా దాన్ని స్టార్ట్ చేయటంతోనే హరించుకుపోతూంది. ఎక్కడపడితే అక్కడ ఆగిపోవటం - దాన్ని తోసుకొని షెడ్‌కి తీసుకెళితే వాడు దాన్ని విప్పటంతో - తీగలాగితే డొంకంతా కదిలిన చందాన అవీయివీ వూడబెరికి అరిగిపోయాయనో - తెగిపోయాయనో చెప్పి వందో రెండొందలో చేతి చమురు వదిలించటం - ఇదో తంతుగా మారింది.

“పోనీ వెధవ మోపెడ్ అమ్మిపారేయకూడదూ!?” అని ఒకటే పోరుపెడుతూంది మా ఆవిడ.

అచ్చం ఓ ఆరునెలల క్రితం - ఇట్లాగే పోరింది బండి కొనమని. మీకంటె ఎటెండర్ ఏకాంబరంకూడా బండి కొన్నాడంది. వారితో వీరితో పోలికలు పెట్టి నానా రాద్ధాంతం చేసిపారేసి నాచేత ‘లోను’ పెట్టించి మరీ కొనిపించింది.

ఈనాడు అది పాడయిపోయిందని మా ఆవిడమీద నేరంతోసేస్తున్నాగాని, నామట్టుకు నేనుకూడా పొరుగు వాళ్ళంతా బళ్ళు కొనటంచూసి అసూయ చెందటం - కోరిక పెంచేసుకోవడం - అదే సమయంలో మా ఆఫీసులోవారంతాకూడా కలిసికట్టుగా కొనిపించే ప్రయత్నానికి పాల్పడ్డం జరిగింది.

అందునా ఓ రోజు మా ఆఫీసుముందు, లారీ ఒకటి వచ్చి ఆగింది. దీనిమీద ఓ క్రొత్త మోపెడ్ ‘డిస్‌ప్లే’మ ఎడ్వర్టయిజ్ చేయటానికని వూరేగిస్తున్నారు.

దానిపేరు ‘గప్‌చిప్’ అని, చడీ చప్పుడు లేకుండా వెళ్తుందని దానికాపేరు పెట్టినట్లు, ఫుట్ బ్రేక్సు, ఆటోమేటిక్ గేర్స్, ఆయిల్ కన్జమ్షన్, షాక్ ఎబ్జార్బర్స్ గురించి చెబుతూ అది ఇటలీ కొలాబరేషన్ అనికూడా వివరించాడు.

బయటకెళ్లి చూసిన మా అందరికీ అందంగా దర్శనమిచ్చింది.

మొత్తానికి నేనా రోజే ఓ బండి వాడ్నవటం - అది మొదలు మొహమాటాలలో ఇరుక్కోవటం - ఆ మొహమాటాలకు ఫలితంగా తడిసి మోపెడైన రిపేర్స్ రావటం - పగలు - రాత్రి అది నాకొక సమస్యగా మారటంకూడా వరుసగ్గా జరిగిపోయాయి.

ఆ రోజుకూడా మోపెడ్‌తో ఆఫీసుకు బయలుదేరి వెళ్తుంటే సరిగ్గా గంట స్తంభం దగ్గరకొచ్చేసరికి ససేమిరా కదలనని పూరీ జగన్నాథుడిలా మొండికేసింది. వందతిట్లు తిడితే ఆ మొండి జగదు మంచి జగ్గడై కదుల్తాడేమోగాని - ‘గప్‌చిప్’ తన పేరును నిలబెట్టుకుంది.

నేనేనాడూ కుస్తీపట్లంటే ఎరుగను. కానీ ఇంతకంటె కుస్తీపట్లు సులువేమో నని పించింది. పెద్ద చెరువులో ఎత్తిపడేయాలని పించేంత ఒళ్లు మండింది.

ఆడెబ్బై కేజీల శకటాన్ని తోసుకుంటూ అక్కడికి దగ్గర్లోని మెకానిక్ దగ్గర పడేసి సాయంత్రం వచ్చేసరికి రెడీచేయమన్నాను.

ఆఫీసుకి అసలే గంటలేటయింది.

ఆఫీసరు నామీద విరుచుకుపడ్డాడు.

డిసిప్లిన్ లేదన్నాడు.

కారణం చెప్పాను.

“ఇదేసాకు ఓ వందసార్లు నీ నోటంట విన్నాను. ఏ రాచకార్యాలు వెలగబెట్టు కొస్తున్నావో నాకేం తెలిసేడుస్తుంది. ఆ వెధవబండి అమ్మి పారేస్తే పోతుంది.

చాలాసార్లు ఆఫీసుకి లేటవటానికి కారణభూతమైన మోపెడు నాపాలిట భూతంలా దాపురించింది.

ఆఫీసయినాక సరాసరి మెకానిక్‌ని కలిసాను. నన్ను చూస్తూనే నా చేతిలో ఆంజనేయుడితోకంత స్పేర్‌పార్ట్స్ లిస్టు పెట్టాడు.

“మొత్తంబండివిప్పి ఓవరాయిలింగుచేసి పార్ట్స్ అసెంబిల్‌చేసి ఇవ్వటానికి అయిదొందలౌతుంది” మీరు డబ్బివ్వటమే తరువాయి నేను తేవటానికి సిద్ధం అన్నట్లు కనిపించాడు.

మాట నాలుగు జ్వరం వచ్చేసింది.

“కొని ఆరునెల్లుకాలేదు. ఇంతమదుపు ఎందుకౌతూంది.” నాకోపం, చిరాకు వాడిమీద రుద్దాను.

“ఎందుకౌతుందేమిటండీ! ఏ చేతకో, సుజుకీవో కొనుక్కుంటే బాగుండేది. మీరు డబ్బుకి జంకి మోపెడ్ కొనుంటారు. అందుకే ఇప్పుడిన్ని బాధలు పడ్డం... మరెందుకు అమ్మిపారేయండి అన్నాడు.

ఇంతమంది చెవినిల్లు కట్టుకుని చెప్ప బట్టి అదే అభిప్రాయం నాలో కాంక్రీటులా స్థిరపడిపోయింది.

ఎంతకు కొన్నానో చెప్పి... ఎంతకెళ్తుందో అడిగాను.

చెప్పాడు!

గుండె గుభేలుమంది !!

“ఏమిటి మూడువేలు లాసుకా!!”

“పోనీలెండి సార్... నేనేదో మింగేస్తున్నట్లు మాట్లాడుతున్నారు. పట్టుకుపోయి మీరే అమ్ముకోండి” అని మోపెడ్ స్టాండ్ తీసి నావైపు త్రిప్పాడు.

వాడిని బ్రతిమిలాడేసరికి నా కంఠనరాలు తెగిపోయాయి.

“నిజానికి మోపెడ్ కొనటానికి ముందుకెవరూ రారుసార్! మార్కెట్లో ఇప్పుడు కొన్నివందల బండ్లు దిగాయి. కానీ మేమే పార్టీని వెతుక్కోని ఏదో ఓలా నచ్చచెప్పి అమ్మిపారేస్తాం. మీకిష్టమైతే చెప్పండి.” అని హేండిల్‌బార్ అటు-యిటు త్రిప్పుతూ అడిగాడు మెకానిక్.

ఇంకా అప్పు అప్పలాగే వుంది - ఒళ్లా మూడువేలు నష్టానికి అమ్మటం? కానీ తప్పదు. వుంటున్నకొద్దీ దాని రేటు మరీ పడిపోతుంది.

సరేనన్నాను.

తన కమీషన్ మూడువందలు - బాగుచేసి అమ్మేదాకా పూచీ పడ్డానికి అయిదువందలు - వెరసి ఎనిమిదివందలు వచ్చే డబ్బులో మినహాయించుకోవలసి వుంటుందనికూడా చెప్పాడు.

ఏవో ఫారాలు తెచ్చి సంతకాలు తీసుకున్నాడు.

నేనా ఛాయలకే రావనవసరంలేదని వారం తరువాత అమ్మి డబ్బు ఇంటికి తెస్తానని అడ్రసు తీసుకున్నాడు.

అన్నప్రకారం నా సొమ్ము నాకు అందిం

చాడు.

తలంటుకున్న హాయి కల్గింది. వచ్చిన నష్టం తలుచుకున్నప్పుడల్లా కళ్లల్లో పులుసు పడిన అనుభూతి కల్గుతూంది.

ప్రస్తుతం రెండు బస్సులుమారి ఆఫీసుకి వెళ్తున్నాను! కొలదికాలం గబ గబ గడిచిపోయింది.

ఒకరోజు ఆఫీసునుండి వచ్చేసరికి నాన్నగారి దగ్గర్నుంచి వుత్తరం వచ్చినట్లు తెలిపింది మా ఆవిడ.

తీసుకుని చదివాను.

ఆరు నెలలుగా నేను వెళ్లటం కాని - ఆయన రావటంకాని కాక పోవటం - వుత్తరాలుకూడా వ్రాసుకోకపోవటం వలన - చాలా బెంగతో ప్రేమ ఒలకబోస్తూ వ్రాసారు.

దానికి జవాబుగా వెంటనే వుత్తరం వ్రాసాను. అయితే బండి కొనటం ఆ వెంటనే పెద్ద నష్టానికి అమ్మేయటం వంటివి వ్రాస్తే తిడతారని చెప్పి ప్రస్తావించలేదు. రెండు బస్సులు మారి ఆఫీసు వెళ్లటం కష్టంగా వుంటూందని మాత్రం తెలిపాను.


తరువాత ఓ వారానికి నన్ను అర్జంటుగా రమ్మంటూ నాన్నదగ్గర్నుంచి లెటర్ వచ్చింది.

ఎందుకో తెలీకపోయినా అర్జంటుకాబట్టి సెలవుపెట్టి వెళ్లాను.

అదీ యిదీ మాట్లాడాం.

"ఒరే రేవంత్! నిన్ను పిలిపించిన కారణం చెబుతున్నాను. నీకు ఆఫీసుకు వెళ్లటానికి చాలా ట్రబుల్‌గావుందని వ్రాసావు కదా! అందుకని నీ సౌకర్యంకోసం - నాల్గువేలకి చౌకగావచ్చిందని సెకండ్‌హాండ్ మోపెడ్ కొన్నాను... ఎవరో ఒకాయన విజయనగరమేనట... ఆరు నెలలు వాడి... పెద్దబండి కొనుక్కోవాలని చెప్పి అమ్మేసాడట... నాకొలీగుకు తెలిసిన మెకానిక్ అమ్మాడు. ట్రాన్స్‌ఫర్ చేయించి రెండురోజుల్లో సి. బుక్ వగైరాలు యిస్తానన్నాడు. నా డబ్బు నీకు వీలున్నపుడు యిద్దూగానిలే!" అన్నారు నాన్న.

"నాన్నా! సుజుకీవో, చేతకో, కొనుక్కుదామనుకుంటుంటే మోపెడ్ కొన్నారా! అనవసరంగా!" నసిగాను.




"ఎందుకురా అన్ని వేలు తగలేసి కొనటం... రిపేరువస్తే వందలకి వందలౌతుంది. ఓసారి త్రొక్కిచూసుకో పద..." అంటూనే వీధిలోకి దారి తీసారు.

వీధిగది తలుపు తెరిచారాయన.

అది చూసిన నేను మంచుకి కొయ్యబారినట్లయ్యాను.

కారణం!

అది నేనమ్మేసిన గప్‌చిప్ మోపెడ్ ఎన్.డి.ఎన్. 4979.